సిఐటియు రాష్ట్ర కౌన్సిల్‌ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- కడప అర్బన్ : సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు ఈ నెల 17, 18న నెల్లూరు నగరంలో నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. శ్రీనివాసులురెడ్డి, బి.మనోహర్, జిల్లా కోశాధికారి బి.లక్ష్మీదేవి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. రెండు రోజులు పాటు నిర్వహించే సమావేశానికి రాష్ట్ర నాయకత్వం హాజరవుతారన్నారు. సమావేశంలో కార్మికుల, ఉద్యోగుల సమస్యల పైన చర్చించి నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని తెలిపారు. ఈ తరుణంలో కౌన్సిల్ సమావేశాలకు ఒక ప్రాధాన్యత కూడుకుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా కొత్తగా వచ్చిన ప్రభుత్వం కార్మికుల, ఉద్యోగుల, స్కీం వర్కర్లు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. జిల్లా నుంచి కౌన్సిల్ ఉన్న నాయకత్వం సమావేశాలకు హాజరవుతారన్నారు.

భూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రతి సోమవారం కలెక్టర్లు నిర్వహించే ప్రజాఫిర్యాదుల వ్యవస్థలో 90 శాతం రెవెన్యూ సమస్యలే ఉండడం ఆందోళన కలిగిస్తోంది. కడప, అన్నమయ్య జిల్లాల్లోని అనేక గ్రామాల్లో ఏళ్ల తరబడి భూసమస్యలు పేరుకుపోయి ఉన్నాయి. అధికారులు సకాలంలో జోక్యం చేసుకుని పరిష్కరించడంలో విఫలం కావడంతో కోర్టు కేసులతో కునారిల్లుతున్న నేపథ్యం కనిపిస్తోంది. ఫలితంగా ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోవడం లేదు. భూసమస్యల అపరిష్కృతం కారణంగా జిడిపిలో రెండు శాతం కోతపడుతోంది. ఫలితం దేశాభివృద్ధిని ప్రశ్నార్థకం చేస్తోంది. రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉంటే వారు తమ అనుచరులకు వత్తాసు పలుకుతూ భూసమస్యల్ని జఠిలం చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం ఇటీవల కడప, అన్నమయ్య జిల్లాల్లో అసైన్డ్, ఇనామ్, ఇతర భూముల ఆక్రమణలు అధికంగా ఉండడంతో ప్రత్యేక విచారణాధికారులను నియమించిన నేపథ్యంలో కథనం..

కబ్జా కోరలు తొలగేనా!

భూ వివాదాల్లోనే గ్రామసీమలు

త్వరలో రెవెన్యూ సదస్సులు

రెవెన్యూ అస్తవ్యస్త ఫలితమే

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. ప్రభుత్వం కడపలో అసైన్డ్ భూమి 99,843 ఎకరాలు, ఫ్రీహోల్డ్ 76,321 ఎకరాలు, అన్నమయ్య జిల్లాలో అసైన్డ్ భూములు 1,41,478 ఎకరాలు, ఫ్రీహోల్డ్ 1,62,442 ఎకరాలు ఉన్నట్లు గుర్తించిన సంగతి తెలిసిందే. వేలాది ఎకరాల ఇనామ్ భూములు అక్రమణల్లో ఉన్నాయని, వీటి పరిష్కారానికి ప్రత్యేక విచా రణాధికారులతో విచారించాలని ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న రెవెన్యూ సదస్సుల్లో ఏమేరకు పరిష్కారం లభిస్తుందో చూడాలి. ఇందుకు అనుగుణంగా మంత్రి డోలా వీరాంజనేయులు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో సమావేశం నిర్వహించి కార్యాచరణకు నడుంబిగించిన సంగతి తెలిసిందే. భూసమస్యల పరిష్కారానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాలతో సమానంగా పట్టణ కేంద్రాలు భూఆక్రమణలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచాయి. రెవెన్యూ, సర్వే అధికారులు సరైన నిర్ణయాలు తీసుకోని ఫలితమే ఇవన్నీ. ఫలితంగా జిడిపిలో రెండు శాతం కుంగుదల కనిపిస్తోందనే వాదన వినిపిస్తోంది. ఇటీవల కలెక్టర్ లోతేటి శివశంకర్ మీడియాతో మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల వ్యవస్థకు వచ్చే ఫిర్యాదుల్లో 90 శాతం సరిహద్దులు, కొలతల్లో వ్యత్యాసాల సమస్యలే ఎక్కువగా ఉన్నాయని, వీటి పరిష్కారానికి ఎటు వైపు నుంచి నరక్కురావాలో అర్థం కావడం లేదని, ఒకవేళ లోపాల్ని గుర్తించి చెప్పినా డాక్యు మెంట్లు ఉన్నాయనే పేరుతో పేచీకి దిగుతున్నారని ఆందోళన వ్యక్తం చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది. కడప జిల్లాలోని కడప, బద్వేల్, అన్నమయ్య జిల్లాలో మదనపల్లి ప్రాంతాలు భూ ఆక్రమణలకు నిలయాలుగా మారాయి. పెద్దపెద్ద కంపెనీలతోపాటు స్థానిక రాజకీయ నాయకులు ఆక్రమణల పర్వం పతాక స్థాయికి చేరుకుంది. సాగు భూములు రియల్‌ఎస్టేట్ వ్యాపారానికి కేరాఫ్ అడ్రస్‌గా మారడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ, 36 మండల కేంద్రాల అత్యధిక ప్రాంతాల పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ భూముల్లో వెంచర్లు దర్శనమిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. వీటిని కొనుగోలు చేసిన ప్రజానీకం బాధి తులుగా మారుతోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితుల నేపథ్యంలో కొనుగోలు చేసిన ప్రజానీకం తీవ్రంగా నష్టపోతోంది. ఇటువంటి అక్రమ వెంచర్లను గుర్తించిన కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ రూ.కోటిపైగా జరిమానాల్ని విధించింది. ఇటువంటి రియల్ ఎస్టేట్ కబంధహస్తాల బారిన పడకూడదనే ఉద్దేశంతో వెంచర్లు ఏర్పాటు చేసి నిర్మాణాలను సైతం పూర్తి చేస్తోంది. ఎక్కడైనా ఖాళీ జాగా కనిపిస్తే పాగా వేయడం పరి పాటిగా మారింది. గతప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను కొందరు కొనుగోలు చేసి ఇళ్ల నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యం బహిరంగ రహస్యం. గత ప్రభుత్వాలు ఇచ్చిన ఇళ్లస్థలాల్లో తాజాగా పక్కా గృహాలు నిర్మించుకున్న ప్రజలు, పాత లబ్ధిదారుల పేరుతోనే ఇళ్లు ఉండడంతో వాటిని మార్చుకోవడానికి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న నేపథ్యం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి భూఆక్రమణల వ్యవహారం పెద్దఎత్తున వెలుగులోకి రావడం తెలిసిందే. మదనపల్లి భూఆక్రమణల కేసును ప్రభుత్వం సిఐడికి బదిలీ చేయడం తెలిసిందే. ఇందులో ఇద్దరు ఆర్డీఓ స్థాయి ఉన్నతాధికారులు సస్పెన్షన్‌కు గురి కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటా : మంత్రి 'మండిపల్లి'

మీడియాతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి -కడప అర్బన్

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని అతి త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. జిల్లా ప్రజలకు అందుబాటులో ఉండేందుకు క్యాంపు కార్యాలయం ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఆర్‌టిసి రీజినల్ మేనేజర్ ఆఫీస్ వెనుక వైపున ఉన్న భవంతిలో మంత్రి తన క్యాంపు కార్యాలయాన్ని ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సుల ఫిట్ మెంట్ ప్రొసీజర్ ప్రకారం కాలం చెల్లిన బస్సుల సర్వీసులను నిలిపివేసి ఆ స్థానంలో కొత్త బస్సులను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. రాబోయే కాలంలో ఎపిఎస్‌ఆర్‌టిసిని ప్రక్షాళన చేసి ప్రయా ణికులకు నాణ్యమైన సేవల అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర రవాణా వ్యవస్థ ద్వారా మరిన్ని ఆర్‌టిసి బస్సులను కొనుగోలు చేసి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. ఈనెల 21న ముఖ్యమంత్రి రివ్యూ మీటింగ్‌లో రవాణా శాఖకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌టిసి ఆర్‌ఎం గోపాల్ రెడ్డి, సిబ్బంది, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు వైద్య సేవలు నిలిపివేత : ఐఎంఎ

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

కోల్‌కత్తాలో జరిగిన వైద్యురాలి అత్యాచారం, హత్య కేసులో సత్వర న్యాయం కోరుతూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) పిలుపుమేరకు శనివారం పట్టణంలోని ఆస్పత్రుల్లో వైద్యసేవలు నిలిపివేస్తున్నట్లు ఐఎంఎ ప్రొద్దుటూరు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ జి.వి.జి.మహేష్, డాక్టర్ వై.హరీష్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కోల్‌కత్తాలో ఆర్.జి.కర్ ప్రభుత్వ కళాశాల ఆసుపత్రిలో ఆగష్టు 9న రాత్రి మహిళా వైద్యురాలిపై అమానుషంగా సామూహిక అత్యాచారం చేసి పాశవికంగా హత్య చేసిన కేసులో సత్వర న్యాయం కోరుతూ, ఆర్‌జికర్ వైద్యకళాశాల విద్యార్థులు వైద్యులపై ఆగష్టు14వ తేది రాత్రి రౌడీమూకల దాడులను నిరసిస్తూ తాము ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. శనివారం ఉదయం నుండి ఆదివారం ఉదయం వరకు పట్టణంలోని అన్ని ప్రయివేట్ ఆసుపత్రులలో అత్యవసర సేవలు మినహాయించి ఒపిడి సేవలు, అత్యవసరం కాని శస్త్ర చికిత్సలు పూర్తి స్థాయిలో నిలిపివేస్తామన్నారు. ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి సిబిఐ ఆధ్వర్యంలో త్వరితగతిన నేరపరిశోధన పూర్తి చేసి నేరానికి పాల్పడిన వారిపై కఠిన శిక్షలు పడేలా చూడాలని తెలిపారు. ఆసుపత్రిలో డ్యూటీలో ఉన్న వైద్యులకు, వైద్య సిబ్బందికి తగిన రక్షణ కల్పించే వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర స్థాయిలో ప్రత్యేక రక్షణ చట్టాలు తీసుకురావాలన్నారు. మన రాష్ట్రంలో ఉన్న వైద్య సిబ్బంది రక్షణ చట్టాన్ని సవరించి కఠినతరం చేయాలన్నారు. ఈ నిరసన తర్వాత ప్రభుత్వాలు తీసుకునే చర్యలను బట్టి తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.తమకు న్యాయం జరిగేంతవరకు ఈ ఉద్యమాన్ని ఆపేది లేదన్నారు. అవసరమైతే మరింత తీవ్రతరం చేస్తామని వృత్తి నిర్వహణలో రక్షణ కల్పించమని అడుగుతున్న తమ న్యాయమైన డిమాండ్లకు ప్రజలు, ప్రజాసంఘాలు,అన్ని రాజకీయ పక్షాలు మద్దతివ్వాలని పేర్కొన్నారు.

ఆయాలకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లావ్యాప్తంగా అంగన్వాడీ సెంటర్‌లో పనిచేస్తున్న అర్హులైన ఆయాలందరినీ టీచర్లుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని, అలాగే టీచర్లు, ఆయాలకు బదిలీలు కల్పించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.మనోహర్ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ సమస్యల మీద రాజీలేని పోరాటం సిఐటియు నిర్వహించిందని తెలిపారు. వాటి ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం హెల్పర్స్‌కు 45 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాలు వయసు సడలించిందని పేర్కొన్నారు. అంగన్వాడీ యూనియన్, సిఐటియు పోరాటం నిర్వహించడం వల్ల సాధ్యమైందని తెలిపారు. కానీ కడప జిల్లాలో ప్రమోషన్స్ ఇవ్వకపోవడం దారుణమని పేర్కొన్నారు. అన్ని జిల్లాల్లో ప్రమోషన్స్ ఇచ్చారని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు జోక్యం చేసుకుని ప్రమోషన్స్ ఇవ్వాలని తెలిపారు. జిల్లాలో చాలా సంవత్సరాలుగా హెల్పర్‌గా పని చేస్తున్నారని పేర్కొన్నారు. అర్హులైనటువంటి హెల్పర్స్ చాలామంది జిల్లాలో ఉన్నారని తెలిపారు. ప్రమోషన్స్ ఇవ్వకపోవడం వల్ల వయసు పెరిగి నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. జిల్లాలో సంవత్సరం దాటినా ఇప్పటికీ ప్రమోషన్స్ ఇవ్వకపోవడం బాధాకరమని తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీలు చేసిన వారు చాలామంది ఉన్నారని పేర్కొన్నారు. కనుక ఐసిడిస్ జిల్లా అధికారులు అర్హులైన వారికందరికీ వర్కర్స్ నుంచి టీచర్స్‌గా ప్రమోషన్స్ ఇవ్వాలని తెలిపారు. ఈ విషయాలన్నిటిపై సోమవారం కలెక్టర్‌ని కలుస్తామని పేర్కొన్నారు. టీచర్లను సూపర్‌వైజర్లుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని పేర్కొన్నారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని పేర్కొన్నారు.

జాబ్ కేలండర్‌ను విడుదల చేయాలి

డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని

సమావేశంలో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చిన్ని

ప్రజాశక్తి - బద్వేలు

రాష్ట్ర ప్రభుత్వం నూతన జాబ్ కేలెండర్‌ను విడుదల చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు నిరుద్యోగ యువతీ యువకుల కోసం అనేక వాగ్దానాలు ఇచ్చిందని, వాటిని తక్షణమే అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో వివిధ శాఖలలో ఖాళీలు వేల సంఖ్యలో ఉన్నాయని, వాటిని భర్తీ చేయడానికి నూతన జాబ్ కేలం డర్ విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో రోజురోజుకూ నిరుద్యోగం పెరుగుతుందని, ఉద్యోగ అవకాశాలు లేక ఇతర దేశాలకు, ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లి చాలీచాలనటువంటి జీతాలు తీసుకొని జీవిస్తున్నారని, అక్కడ అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, కావున ఖాళీలను భర్తీ చేసి నిరుద్యోగ యువతీ యువకులకు రాష్ట్రంలోనే ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి అన్ని శాఖల ఖాళీలను నూతన జాబ్ కేలెండర్ ద్వారా భర్తీ చేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ యువతీ యువకులు ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం పెద్ద ఎత్తున పోరాటాలు కొనసాగిస్తామని వారు తెలిపారు. సమావేశంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్షుడు ఎస్కే మస్తాన్ షరీఫ్, మహిళా కో కన్వీనర్ నాగలక్ష్మి, ఉపాధ్యక్షులు ఎస్.కె ఆదిల్, సహాయ కార్యదర్శి ఇమ్మానియేలు, రామకృష్ణ పాల్గొన్నారు.

మేళాను ప్రారంభిస్తున్న కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్

రూ.10 నాణేలపై అవగాహన

- మేళాను ప్రారంభించిన కెనరా బ్యాంక్ రీజనల్ మేనేజర్ కె.మురళీమోహన్

ప్రజాశక్తి - కడప

రూ.10 నాణెం చెల్లుబాటు అవుతుందని ఆర్‌బిఐ అధికారికంగా ప్రకటించిందని అని కెనరా బ్యాంక్ రీజనల్ మేనేజర్ కే మురళీమోహన్ అన్నారు. కలెక్టర్ శివ శంకర్ లోతేటి సూచనల మేరకు శుక్రవారం కెనరా బ్యాంక్ వద్ద నాణేలపై చలామణి మేళా, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆర్ఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణెం చెల్లుబాటుపై స్పష్టత ఇచ్చారు. తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని ఈ సందర్భంగా గుర్తు చేశారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జి. జనార్ధనం మాట్లా డుతూ నాణెం చెల్లుబాటు అవుతుందని వాటిని అందరూ విరివిగా వాడాలని తెలిపారు. నాణేలను అన్ని రకాల లావా దేవీలకు వీటిని ఉపయోగించుకోవచ్చునని, ఎటువంటి ఆంక్షలు లేవని తెలిపారు. కార్యక్రమంలో వివిధ రకాల వ్యాపారులు పాల్గొని దాదాపుగా లక్ష రూపాయలు విలువ చేసే నాణేలను తమ వ్యాపార నిమిత్తం తీసుకున్నారు. కార్యక్ర మంలో కెనరా బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయ డివిజనల్ మేనేజర్ ఎస్. రమేష్, కడప మెయిన్ బ్రాంచ్ మేనేజర్ పి. మధుకర్, ఇతర శాఖల మేనేజర్లు పాల్గొన్నారు.

డ్రాగా ముగిసిన కడప, చిత్తూరు మ్యాచ్

ప్రజాశక్తి - కడప : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్- 19 గ్రూపు-బి అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా కెఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో కడప చిత్తూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు 365 పరుగులు చేసింది. 5 వికెట్ల నష్టానికి 324 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు 100.1 ఓవర్లలో 413 పరుగులు చేసి అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని ఆర్. రోహిత్ 194 పరుగులు (సెంచరీ) చేశాడు. ధీరజ్ కుమార్ రెడ్డి 30 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని సాయి హర్షిత్ రెడ్డి అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు డి. బాలాజీ 2వికెట్లు తీసుకున్నాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి 48.0 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 228 పరుగులు చేసింది. ఆ జట్టులోని హర్ష సాయి రెడ్డి 103 పరుగులు (సెంచరీ) చేసి నాట్ అవుట్‌గా నిలిచాడు. లోహిత్ లక్ష్మీనారాయణ 64 పరుగులు చేసి నాట్ అవుట్ గా నిలిచాడు. మ్యాచ్ డ్రాగా ముగిసింది.

చర్చి ఆస్తుల పరిరక్షణకు సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి - కడప అర్బన్

రాయలసీమ అధ్యక్ష మండల సిఎస్ ఐటిఎ ఆస్తుల పరిరక్షణకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని, ఆస్తులు అమ్మడం, లీజుకు ఇవ్వడం లాంటి హక్కులు బిషప్ ఇజాక్ వరప్రసాద్‌కు ఏ మాత్రం లేదని శాప్ మాజీ డైరెక్టర్ డేనియల్ ప్రదీప్ కుమార్ అన్నారు. గురువారం వైఎస్ఆర్ ప్రెస్ క్లబ్‌లో జమ్మలమడుగు కాంబెల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అగస్టీన్ అధ్యక్షతన సిఎస్ఐటిఎ ఆస్తులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా డేనియల్ ప్రదీప్ మాట్లాడుతూ ఇప్పటికే అనేక ఆరోపణలతో ఐజాక్ వరప్రసాద్ బిషప్ హోదాను కోల్పోయారని చెప్పారు. చర్చి ఆస్తుల రక్షణకోసం ఆయనను బిషప్‌గా నియమించారే తప్ప ఏది పడితే అది అమ్ముకోవడానికి కాదని మండిపడ్డారు. త్వరలో చర్చిలకు మంచి రోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రస్తుతం తక్కువ మందితో పోరాటం మొదలైందని, ఇది రాయలసీమ మొత్తం వ్యాప్తి చెందుతుందని చెప్పారు. ఈ విషయంలో కలెక్టర్, ఎస్‌పి స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. లేక పోతే ముఖ్య మంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, గవర్నర్ దృష్టికి కూడా తీసుకెళ్తామని పేర్కొన్నారు. కమలాపురం పాస్టర్ ఐక్యత రావు మాట్లాడుతూ ఐజాక్ వరప్రసాద్ కుటుంబ సభ్యులు లబ్ధి పొందేందుకు బిషప్‌గా ఆయన్ను నియమించలేదని తెలిపారు. ఆస్తులను కాపాడాల్సిన బిషప్ అమ్ముకోవడం తగదన్నారు. చర్చి ఆస్తులు విద్య, వైద్యం, ఆరోగ్య అంశాలకే వినియోగించాలే తప్ప లీజుకు ఇవ్వడం, అమ్మడం నేరమని చెప్పారు. ఆస్తులు అన్యాక్రాంతం అయినప్పుడు అడిగే హక్కు రాయలసీమలోని నాలుగు జిల్లాల క్రైస్తవులకు ఉందని పేర్కొన్నారు. అనంతరం ప్రజా సంఘాల జెఎసి నాయుకుడు జె.వి.రమణ మాట్లాడుతూ ఏ మతమైనా,ఏ సంఘమైనా, ఏ కులమైనా సమస్యల్లో ఉన్నప్పుడు భారత పౌరులుగా ఆ సమస్యలను పరిష్కరించాల్సిన హక్కు, బాధ్యత తమకు ఉందని తెలిపారు. సదసు కు అధ్యక్షతన వహించిన డాక్టర్ అగస్టిన్ మాట్లాడుతూ గతంలో రాయలసీమ అధ్యక్ష మండలం సస్యశ్యామలంగా ఉండేదని, కొంత మంది స్వార్థం వల్ల చర్చిల ఆస్తులు నిర్వీర్యం అవుతున్నాయని చెప్పారు. సమావేశంలో అడ్వకేట్ అమీన్ పీరా, జేఏసీ నేతలు అవ్వారు మల్లికార్జున, ప్రతాప్ రెడ్డి, కైపు రామాంజనేయులు, ప్రభాకర్, శ్రీకృష్ణ దేవరాయలు, రమణ, కడప, ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మల మడుగు ప్రాంతాల సిఎస్ఐ చర్చి పాస్టర్లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనులను నాణ్యతతో పూర్తిచేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

పేదల సొంతింటి కల సాకారం చేసే దిశగా హౌసింగ్ పథకంలో లబ్దిదారులకు ఎలాంటి పెండింగ్ లేకుండా గృహ నిర్మాణాలను నాణ్యతతో పూర్తి చేయాలని శివశంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు.శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో పేదలకు గృహ నిర్మాణ పథకంలో భాగంగా గృహ నిర్మాణాల ప్రక్రియలో పెండెన్సీపై సంబందిత అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాష్ట్రం చేపట్టిన పేదలందరికీ సొంతింటి కల సాకారం చేసే హౌసింగ్ పథకంలో భాగంగా జిల్లాలో ఇప్పటికే గృహాలు మంజూరై, ఇంటి నిర్మాణాల ప్రక్రియలో వెనుకబడిన ప్రాంతాల్లో త్వరిత గతిన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం గృహ నిర్మాణాలు చేపడుతున్న కాంట్రాక్టర్లు నాణ్యతతో ఎలాంటి రాజీ లేకుండా పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన ఇసుక పాలసీకికి లోబడి ఇసుకను సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఇసుక అవసరం ఉన్న లేఅవుట్లలో పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇసుకను సరఫరా చేస్తామని తెలిపారు. ప్రస్తుతం వివిధ దశల్లో జరుగుతున్న నిర్మాణ పనులను సంబందిత క్షేత్రస్థాయి అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తూ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మెటీరియల్, లేబర్ కాంపోనెంట్, బిల్లుల పెండింగ్, ఇసుక, ఇనుము, నీరు, రోడ్లు తదితర అంశాలపై నేరుగా సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్షించారు. ఎలాంటి సమస్యలున్నా తెలియజేయాలన్నారు. గృహ నిర్మణాలు జరుగుతున్న అన్ని లేఅవుట్లపై ప్రత్యేక దృష్టి సారించి గృహ నిర్మాణ లక్ష్యంలో జిల్లాను ప్రథమ స్థానంలో కొనసాగించాలన్నారు. పేదలకు హౌసింగ్ పథకంలో మున్సిపాలిటీలు, మండల స్థాయిలో నిర్దేశిత లక్ష్యాలను అధిగమించాలని, నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో హౌసింగ్ పీడి కృష్ణయ్య, డ్వామా ఇంచార్జి పీడి జోయల్ విజయ్ కుమార్, కడప నగర కమీషనర్ వై.ఓ. నందన్, అదనపు కమిషనర్ రాకేష్, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్‌ఎఇలు, డిఇలు, కాంట్రాక్టర్లు, శాండ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ విమలమ్మ పాల్గొన్నారు

భోజనాన్ని పరిశీలిస్తున్న జడ్జి బాబాఫక్రుద్దీన్

సమస్యలుంటే డిఎల్ఎస్ఎ దృష్టికి తీసుకురండి : జడ్జి

ప్రజాశక్తి - కడప

ఏమైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ (డిఎల్ఎస్ఎ) దృష్టికి తీసుకురావాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ ఎస్ బాబా ఫక్రుద్దీన్ అన్నారు. శుక్రవారం కడప నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహాన్ని జడ్జి సందర్శించారు. పిల్లలు ఏయే తరగతులను అభ్యసిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను, వంటశాలను పరిశీలించారు. పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2015 వివరించారు. విద్య విలువైంది క్రమశిక్షణతో అభ్యసించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. పిల్లల విద్యా ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని అధికారులను ఆదేశించారు.

ఉపాధి కల్పించకపోవడం దారుణం

ప్రజాశక్తి - బద్వేలు పట్టణంలోని ప్లైవుడ్ పరిశ్రమలో విభిన్న ప్రతిభావంతులకు 4శాతం రిజర్వేషన్ పద్ధతిలో ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇండ్ల ఓబులేసు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 3 వేలకు పైగా విభిన్న ప్రతిభావంతులున్నారని, ప్రభుత్వం నుంచి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక, ఇతర పనులు చేయలేక ఇబ్బందులు పడే పరిస్థితి వచ్చిందని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే విభిన్న ప్రతిభావంతులకు ఉపాధి ఉద్యోగాలు కల్పించాలని కోరారు. బద్వేల్ పట్టణం రోజురోజుకు అభివృద్ధి అవుతున్న క్రమంలో విభిన్న ప్రతిభావంతులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉన్నారని, బద్వేలులో ప్లే వుడ్ పరిశ్రమ రాజకీయ ప్రలోభాలకు అడ్డగా మారిందని, రాజకీయ నాయకుల ఆదేశాల మేరకు అక్కడ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఇవ్వటం అనేది సరికాదన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పిం చడంలో కంపెనీ పూర్తి బాధ్యతగా ఉండాలన్నారు. విభిన్న ప్రతిభా వంతులను అర్హతను, వారి శక్తి సామర్థ్యాలను బట్టి వారికి ఉపాధి ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో నిరుద్యోగుల వికలా ంగుల విభాగం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఇప్పటికే అనేక మందిని ఉన్నపలంగా తీసేస్తున్నారన్న వార్త చాలా బాధాకరం వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన సమస్యకు పరిష్కారం చూపకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బద్వేల్ ఏరియా అధ్యక్షులు గొడుగునూరు బాలరాజు, వికలాంగుల నిరుద్యోగుల విభాగం బద్వేల్ ఏరియా అధ్యక్షులు సత్యం, బి కోడు మండల కన్వీనర్ మోహన్ రెడ్డి, బి మఠం మండల కన్వీనర్ మునీంద్ర పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణకు క్విజ్ పోటీలు : డిఎంహెచ్ఓ

ప్రజాశక్తి - కడప అర్బన్

మాట్లాడుతున్న డిఎంహెచ్ఓ నాగరాజు

రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ, యూత్ ఫెస్ట్ 2024 లో భాగంగా హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహన కోసం యువతకు మార్తన్, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20న ఉదయం 5:30 గంటలకు మహావీర్ సర్కిల్ నుంచి ఫైవ్ కె రన్ ప్రారంభమవుతుందని చెప్పారు. 17 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసు ఉన్న కళాశాల విశ్వవిద్యాలయ విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. పోటీలలో పాల్గొన్న పురుషులకు, మహిళలకు, ట్రాన్స్ జెండర్స్‌కు వేర్వేరుగా బహు మతులు అందజేస్తామని తెలిపారు. క్విజ్ పోటీలకు 13 నుంచి 17 సంవత్సరాల వయసు గల విద్యార్థులు అర్హులని చెప్పారు. వివరాలకు 9177103196, 903288 8638లలో సంప్రదించాలని కోరారు. సమావేశంలో లెప్రసి ఎయిడ్స్, టిబి అధికారి రవిబాబు, ఎన్ ఎస్ స్ అధికారి వెంకటరామిరెడ్డి, జిల్లా క్రీడా అధికారి జగన్నాథ రెడ్డి, నెహ్రూ యువకేంద్రాధికారి మణికంఠ, స్టేప్ మేనేజర్ సుబ్బరాయుడు, విద్యాశాఖ ఏడి మునీర్ ఖాన్, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

కోట్ల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి

నిజాయితీకి నిలువుటద్దం 'కోట్ల' : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

నీతికి, నిజాయితీకి, నిర్భీతికి, నిరాడంబరతకు నిలువుటద్దం మాజీ సిఎం కోట్ల విజయభాస్కర్ రెడ్డినని పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో మాజీ సిఎం కోట్ల విజయభాస్కర్ రెడ్డి 104వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ లాయరుగా, క్రీడాకారుడుగా, రాజకీయ నాయకుడిగా, పరిపాలనాదక్షునిగా కొనసాగిన విజయభాస్కర్ రెడ్డి బహుముఖ ప్రజ్ఞాశాలి అన్నారు. ఆయన వ్యక్తిత్వం హిమాలయాల వలే ఉన్నతమైందని చెప్పారు. ఆయన కోట్ల మంది అభిమానులను సంపాదించినట్లు చెప్పారు. కర్నూల్ జిల్లా పరిషత్ చైర్మన్‌గా, 5 సార్లు శాసనసభ్యునిగా, 6 సార్లు పార్లమెంటు సభ్యునిగా, రాష్ట్ర మంత్రిగా, కేంద్ర మంత్రిగా, 2 సార్లు ముఖ్యమంత్రిగా అనేక పదవులు అలంకరించినట్లు చెప్పారు. పదవులకే వన్నె తెచ్చిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ధ్రువకుమార్ రెడ్డి, సుబ్రమణ్యం, చెన్నకేశవ, రామకృష్ణ, అమర్, ఉత్తన్న,బాలం సుబ్బ రాయుడు, వేమయ్య, వేమా రాజా, వినయ్, రవి, నాగరాజు, మహబూబ్ బాషా, వెంకటేశు పాల్గొన్నారు.

దర్బార్‌కు నామినేటెడ్ పదవి దక్కేనా!

ప్రజాశక్తి - వేంపల్లె

సాధారణ ఎన్నికల్లో టిడిపి పార్టీ కోసం ఆహర్నిశలు కృషి చేసిన మైనార్టీ నేత నిమ్మకాయల మహమ్మద్ దర్బార్‌కు కూటమి ప్రభుత్వం నామినేట్ చేసే నామినేటెడ్ పదవి వరించేనా అని పలువురు చర్చించు కొంటున్నారు. వేంపల్లెకు చెందిన మహమ్మద్ దర్బార్ గత 30 సంవత్సరాల పాటు వైఎస్ రాజారెడ్డి హయం నుంచి కాంగ్రెస్, వైసిపి పార్టీలో ఉండి ఎనలేని సేవా చేసినప్పటికీ స్థానిక నాయకుల మాటలను నమ్మి ఎలాంటి పదవి దక్కక పోవడంతో పాటు గౌరవం కూడా దర్బార్‌కు ఇవ్వలేదు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన ఏడాది కిందట టిడిపిలో చేరి ఉత్సాహం నింపడంతో పాటు పార్టీ కోసం ఎనలేని కృషి చేశారు. పార్టీలో చేరినప్పుటి నుంచి యవతను ఎక్కువగా పార్టీలోకి తెచ్చేందుకు కృషి చేశారు. అలాగే ఎన్నికల్లో ఏజెంట్లు పెట్టడంనూ కీలక పాత్ర వహించారు. టిడిపిలో చేరినప్పుడే పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవి దర్బార్‌కు భరోసా ఇచ్చారు. టిడిపి తన ప్రతిభను గుర్తించి గౌరవం ఉండే పదవి ఇవ్వాలని అప్పట్లో దర్బార్ కోరారు ప్రస్తుతం పలువురు టిడిపికి చెందిన నాయకులు నామినేటెడ్ పదవుల కోసం ఆశతో ఉన్నారు. పార్టీ కోసం కృషి చేసిన మైనార్టీ నేతకు కూడా గుర్తింపు ఇస్తారా, ఇవ్వరా అనేది సందేహంలో టిడిపి కార్యకర్తలు, ప్రజల్లో నెలకొంది.

నేటి నుంచి శ్రీవేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల కేంద్రంలో వెలసిన శ్రీ వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి ఏర్పాటు సిద్ధం చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ పునరుద్ధరణలో భాగంగా ఎండోమెంట్ ద్వారా రూ. కోటి, దాతల నుంచి వివిధ రూపాల్లో రూ. 50 లక్షలతో ఆలయ నిర్మాణం చేపట్టారు. శనివారం గోపూజ, వాస్తు హోం, 18న ధ్వజ స్తంభం ప్రతిష్ట, స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. 19న ఉదయం 4.43 గంటలకు యంత్ర ప్రతిష్ఠ, స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ, మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆన్నదానం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల కార్యక్రమాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్ : ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, విద్యుత్ తీగలు సరిచేయడం, చెట్లు తొలగించడం వంటి పనుల నేపథ్యంలో శనివారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జమ్మలమడుగు పట్టణం, మండల వ్యాప్తంగా, విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఎఇ రాజబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యాపారులు, రైతులు, ప్రజలు సహకరించాలని తెలిపారు.

దుకాణాలలో దాడులు చేస్తున్న శానిటేషన్ అధికారి, సిబ్బంది

పది కిలోల ప్లాస్టిక్ కవర్లు పట్టివేత

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పట్టణంలోని దుకాణాలపై శానిటరి ఇన్‌స్పెక్టర్ జి. శ్రీనివాస్ శుక్రవారం దాడులు నిర్వహించి పది కిలో ప్లాస్టిక్ కవర్లు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ వాడకం నిసిద్ధమని చెప్పినా పదే పదే వాడుతున్నారని అలా వాడే వారిపైనా, దుకాణాలపై ఒక్కో దుకాణం పై రూ.500 జరిమానా విధించామన్నారు. ఇదే పునరావృతం చేయవద్దని హెచ్చరించారు. మార్కెట్ వీధి, తాడిపత్రి రోడ్డులలోని దుకాణాలతో పాటు, తోపుడు బండ్లు, ఇతర చిరు వ్యాపార కూడలిలో తనిఖీలు చేపట్టారు.

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం

ప్రజాశక్తి - చాపాడు :మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం ఆవరణలో శుక్రవారం ఆలయ వేదపండితుల సమక్షంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. ఆలయ ఇఒ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వేద పండితులు నరేంద్ర స్వామి వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి మహిళల అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో చిన్నా, గోవిందు స్వాములు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న మహిళలు

నిరుపయోగంగా శుద్ధి నీటి పథకం

నిరుపయోగంగా ఉన్న శుద్ధి నీటి కేంద్రం

ప్రజాశక్తి - చాపాడు

మండల కేంద్రంలోని పిహెచ్‌సిలో ఉన్న శుద్ధినీటి పథకం నిరుపయోగంగా మారింది. కొన్ని నెలల నుంచి మరమ్మతులకు నోచుకోక పోవడంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. 2019లో రాజ్యసభ సభ్యుడు సి.ఎం. రమేష్ నాయుడు నిధుల ద్వారా రూ. 5 లక్షలు కేటాయించి శుద్ధి నీటి కేంద్రాన్ని నిర్మించారు. ఆసుపత్రి సిబ్బంది, రోగులకు ఉపయోగకరంగా ఉంటుందని అప్పటి టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్ యాదవ్ మంజూరు చేసి నిర్మించారు. గతంలోనూ పలు మార్లు పథకానికి మరమ్మతులు చేపట్టకుండా వదిలేశారు. ప్రస్తుతం తాగునీటి కోసం సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీటి నిర్వహణ కోసం ప్రత్యేక నిధులు లేకపోవడంతో వీటిని అలాగే వదిలేశారు. మరమ్మతులు ఏవరైనా చేయిస్తారని దాతల కోసం ఎదురు చూస్తున్నారు. దీంతో రూ. 5 లక్షలతో నిర్మించిన నీటి పథకం నిరుపయోగంగా మారింది. దీంతో సిబ్బంది, రోగులు, తాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పిహెచ్‌సి ప్రహరీ పరిధిలో ఉన్న చేతి పంపు కూడా మరమ్మతులకు నోచుకోలేదు. ఈ చేతి పంపు నుంచి గతంలో చాపాడు గ్రామస్తులు తాగునీటిని కూడా తీసుకు వెళ్లేవారు. ఇప్పటికైనా పంచాయతీ నిధులతో చేతిపంపులు కూడా మరమ్మతులు చేయిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

మరమ్మతులకు నోచని చేతి పంపు

వడ్డెరలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వం వడ్డెర కులస్తులకు అన్ని విధాల అండగా ఉంటూ వారి అభివృద్ధికి కృషి చేస్తుందని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని అజయ్ ఫంక్షన్ హాల్‌లో వడ్డెర విద్యావంతుల చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెరలకు గతంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేందుకు తమ వంతు బాధ్యతగా కృషి చేస్తానని తెలిపారు. వడ్డెరల హక్కుల సాధనకు తాను ముందు ఉంటానని వారి హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా చూసుకుంటామని పేర్కొన్నారు. వడ్డెరలు అన్ని రంగాల్లో కూడా వెనుకబడి ఉన్న మాట వాస్తవమని వారిని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడానికి తెలుగుదేశం ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. వడ్డెర్లకు ఎక్కడ ఇబ్బంది కలిగిన వాటిని పరిష్కారం చేయడానికి తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. రాయచోటిలో మొట్టమొదటిగా వడ్డెరలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించడంలో తమ కుటుంబం ముందు వరుసలో ఉందని రాయచోటి మున్సిపాలిటీ మొట్టమొదటి చైర్మన్‌గా వడ్డెర కులానికి చెందిన దేరంగుల వీరభద్రయ్యను చేసిన ఘనత తమ కుటుంబానికి దక్కుతుందని గుర్తు చేశారు. 90 శాతానికి పైగా వడ్డెరులందరూ తనకు ఓటు వేశారని నా గెలుపులో వారు భాగస్వాములు అయినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. వడ్డెరలకి దక్కాల్సిన క్వారీలు పెత్తందారుల చేతుల్లో ఉండిపోతున్నాయని వడ్డెరలకు దక్కడం లేదని వారికి తీరని అన్యాయం జరుగుతున్నదని విద్యావంతుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు లీగల్ అడ్వైజర్ టి.ఈశ్వర్ సదస్సులో ప్రస్తావించగా ఇందుకు స్పందించిన మంత్రి మండిపల్లి ఏ క్షణంలోనైనా సరే ఎక్కడ అన్యాయం జరిగినా తాను అందుబాటులో ఉంటానని ఆ సమస్యల పరిష్కారానికి ముందు ఉంటానని హామీ ఇచ్చారు. న్యాయవాది టి.ఈశ్వర్ మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 50 లక్షల జనాభా ఉన్న వారిలో 80 శాతం మంది అన్ని రకాల నిర్మాణాలలో పాల్గొంటూ వెలకట్టలేని శ్రమ చేస్తున్నప్పటికీ 175 ఎమ్మెల్యేలలో ఒక్క వడ్డెర లేకపోవడం బాధ కలిగించే విషయమన్నారు. విద్యామంతులు వేటగాం గౌరవ అధ్యక్షులు రమణయ్య మాట్లాడుతూ మనదేశంలో తెలుగు రాష్ట్రాలలో తప్ప ఇతర రాష్ట్రాలలో వడ్డెరలు ఎస్సీ, ఎస్టీలుగా ఉన్నారని దీనితో ఆయా రాష్ట్రాలలో వడ్డెరల ప్రాతినిధ్యం అన్ని రంగాలలో ఉందని పేర్కొన్నారు. మన రాష్ట్రంలో కూడా వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చడానికి జరుగుతున్న వడ్డెర్ల ఉద్యమానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అండగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మరో పులివెందుల లాంటి రాయచోటిలో రాంప్రసాద్‌రెడ్డి గెలవడం అందులోనూ మంత్రి కావడం మన అదృష్టమని పేర్కొన్నారు. డాక్టర్ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ తన తండ్రికి మున్సిపల్ చైర్మన్‌గా అవకాశమిచ్చింది మండిపల్లి కుటుంబమేనని అందుకే ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా వడ్డెరలకు అన్ని రంగాలలో కూడా ప్రాతినిధ్యం ఇవ్వాలని అప్పుడే వడ్డెర జాతి అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి విద్యావంతులు వేదిక నాయకుడు కోటేశ్వరరావు అధ్యక్షత వహించి విద్యావంతుల వేదిక ఇప్పటివరకు వడ్డెరల కోసం ఇతరుల కోసం చేసిన ఉద్యమాలను గురించి వివరించారు. కార్యక్రమంలో కడప వార్త రమణ, సర్పంచ్ వాసు, న్యాయవాది నాగముని, కోటకొండ రవి, వడ్డెర విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి మారుతి శంకర్, జీవానందం, ఉపాధ్యక్షులు ,చల్లా రెడ్డయ్య కుంచపు రెడ్డయ్య, బండల శీను, విజయనగరం రామకృష్ణ, నూలివీడు నాగేశ్వరరావు, శివ ప్రసాద్ విడగొట్టు నాగేశ్వరరావు, దుద్యాల శంకర్, హరినాథ్ దేవరాజ్, ఎల్ఐసి చిన్నప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడ్డెర కుల సంఘ పెద్దలు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి గజమాలతో ఘనంగా సన్మానించారు.

మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లు

- ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్

అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే, నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్‌లను ప్రారంభించినట్లు మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. శుక్రవారం మదనపల్లె పట్టణంలోని మార్కెట్ యార్డు, సంత గేటు వద్ద అన్న క్యాంటీన్లను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజలు ఆహారం దొరకక ఎట్టి పరిస్థితుల్లో పస్తులుండకూడదనే గొప్ప ఆశయంతో అన్న క్యాంటీన్‌లను ప్రారంభించామని పేర్కొన్నారు. పేదల కడుపు నింపేందుకే కేవలం రూ.ఐదులకే భోజనాన్ని అందించే బృహత్తర కార్యా న్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తలపెట్టడం శుభ పరిణామన్నారు. పేదల నోటికాడ కూడును పీకేసిన చరిత్ర గత ప్రభుత్వానిదైతే ప్రజలకు పట్టెడ న్నం పెట్టే బృహత్తర కార్యాన్ని చేపట్టడం టిడిపి కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మదనపల్లె టమోటా మార్కెట్ యార్డుకు సుదూర ప్రాంతాల నుంచి ఎంతో మంది రైతులు వస్తుంటారని, వీరితోపాటు ఇక్కడ ఎంతో మంది కూలీలు పనులు చేసుకుంటూ జీవనం చేస్తున్నారని వారందరికీ కేవలం రూ.ఐదులకే టిఫిన్, భోజనం, డిన్నర్ మూడుపూటల కలిపి రూ.15లకే అందిస్తూ వారి కడుపు నింపే కార్యక్రమం చేపట్టడం మనసుకు ఎంతో ఆనందా న్నిస్తోందని పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్లో శుచి, శుభ్రత, నాణ్యతకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ఒక్క పూట భోజ నం రూ.ఐదుకు అందిస్తూ పేదల కడుపు నింపే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకా రం చుట్టిందన్నారు. మొదటి రోజు ఏ విధంగా నాణ్యమైన భోజనాన్ని అందిం చామో ప్రతీరోజు ఇలానే అందించేందుకు తగిన చర్యలు చేపడతామన్నారు. ప్రతి క్యాంటీన్లోనూ ఉదయం 350 మందికి, మధ్యాహ్నం 350 మందికి, రాత్రి 350 మందికి ఇలా రెండు క్యాంటీన్‌ల ద్వారా 2100 మందికి ప్రతీరోజు నాణ్యమైన భోజనాన్ని అందించే ఏర్పాటు చేస్తామన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలు, కూలీలు, మార్కెట్లకు వచ్చే రైతులు ఈ క్యాంటీన్ లను ఉపయో గించుకొని ఆకలి తీర్చుకోవాలని కోరారు. అనంతరం క్యాంటీన్‌లో భోజనాన్ని రుచి చూసిన ఎమ్మెల్యే పలువురికి వడ్డించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, టిడిపి నాయకులు నాదెళ్ళ విద్యాసాగర్, షంషీర్, నాగూర్ వల్లి, జనసేన నాయకులు శ్రీరామ రామ రామాంజులు పాల్గొన్నారు.

మంత్రికి 'ఓంశాంతి' కానుక

ప్రజాశక్తి - కడప అర్బన్

ఓం శాంతి ప్రజాపిత బ్రహ్మ కుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ సేవా కేంద్రం నుంచి బ్రహ్మ కుమారి బి.కె. ప్రదీప అక్కయ్య శుక్రవారం రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రివర్యులు రాంప్రసాద్ రెడ్డిని కలిసి రాఖీ కట్టి, ఈశ్వరీ య కానుకను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్న చెల్లెల అనురాగానికి రాఖీ పండుగ నిదర్శనమని పేర్కొన్నారు. ఓం శాంతి ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరయ సేవలు మరువలేనవని చెప్పారు. సేవలు ఇలాగే కొనసాగించాలన్నారు.

సిఐ పురుషోత్తమరాజుకు సన్మానం

ప్రజాశక్తి-చెన్నూరు

చెన్నూరు పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్. పురుషోత్తమరాజు బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం స్టేషన్‌లో వైసిపి నాయకులు ఆయన సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదంమోపాలని వారు సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు చీర సురేష్ యాదవ్, ఆర్.వి. సుబ్బారెడ్డి, మండల కన్వీనర్లు భాస్కర్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహాదారు ఎర్రసైన్ మోహన్‌రెడ్డి, అన్వర్‌బాషా , మహమ్మద్ రబ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు

IN THE COURT OF ADDITIONAL SUBORDINATE JUDGE AT PONNER
MCOP NO: 58/ 2022

C.Venkatesh ...**Petitioner**

Vs

Dasari Prabhakar and another ...**Respondents**

To

Dasari Prabhakar, S/o. Selvaraju, No:4/ 186-A, Ganjikunta, Mydukur, YSR Cuddapah District, Andhra Pradesh-516173. ...**1st Respondent**

Please take Notice that the above case was filed by the Petitioner for Compansation, same was posted for your appearance to make any Objection on 27/ 08/2024 at 10.30 A.M. either in person or through your counsel if you fail to appear on that day case will be decided as Exparte.

S.C.PALLAVAN, B.SC.,B.L.,
Counsel for Petitioner

ఎస్‌టిలకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

గిరిజన ఉద్యోగులకు న్యాయం చేయాలని ఆలిండియా గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొండయ్య, సీనియర్ నాయకులు చంద్రశేఖర్, గంగాధర్, లక్ష్మయ్య కోరారు. శుక్రవారం పాత రిమ్స్‌లో ఉన్న ఆర్డీ కార్యాలయంలో రీజినల్ డైరెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయ కులు మాట్లాడుతూ వివిధ శాఖల్లో గిరిజన ఉద్యోగులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఇతర కులాల వారు ఎస్‌టి పేరుతో ఉద్యోగాలు పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 206 స్టాఫ్ నర్స్ ఉద్యో గాల్లో ఎస్‌టి లకు న్యాయం చేయాలని కోరారు. వివిధ హోదాల్లో పనిచేస్తున్న గిరిజన ఉద్యోగులకు రోస్టర్ పాయింట్స్ పాటించి ఉద్యోగోన్నతి కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రామకృష్ణ, సుంకన్న, వెంకటసుబ్బయ్య, శివశంకర్, శివా నాయక్, మహిళా కార్యదర్శులు ప్రమీల, ప్రసన్న, గంగాదేవి పాల్గొన్నారు.

ఆర్‌డిని సన్మానిస్తున్న గిరిజన ఉద్యోగ సంఘం నాయకులు

కాల్వ పనులు చేస్తున్న కూలీలు

త్వరలో ఎర్రచెరువుకు నీరు

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు ఎర్ర చెరువుకు నీటిని త్వరగా నింపే ప్రయత్నాలు అధికారులు, టిడిపి నాయకులు ముమ్మరం చేశారు. బోర్లకు నీళ్ల రాకపోవడంతో మైదుకూరు మున్సిపాలిటీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గమనించిన అధికారులు ఎస్ఆర్2 నుంచి ఎర్ర చెరువుకు నీరు వచ్చే మార్గంలో అనేక చోట్ల నీటిని వదిలి చెరువులకు, పొలాలకు మళ్లించారు. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి కాలువ వెంబడి మున్సిపాలిటీ, తెలుగు గంగ ఎఇలు కిరీటి, నాగిరెడ్డి పరిశీలించారు.

పంట కాలువ నిర్మాణం చేపట్టాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలంలో వెంటనే పంట కాల్వలు నిర్మాణం చేపట్టాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.వి. సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మార్క్స్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు బ్రహ్మం సాగర్ ఎద్దుల ఈశ్వర్ రెడ్డి జలాశయం (గండికోట) పైడిపాలెం, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, మైలవరం ప్రాజెక్టులన్నీ కూడా నీళ్లు లేక వెలవెల పోతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శ్రీశైలం జలాశయం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా పూర్తి సామర్థ్యం 44 వేల క్యూసెక్కుల నీటిని వదిలి జిల్లాలోని ప్రాజెక్ట నీటితో నింపాల్సి ఉందన్నారు. పాజెక్టులోకి నీరు వచ్చిన తర్వాత పంట పొలాలకు నీరు ఇవ్వాలంటే కాలవలు లేని దుస్థితి నెలకొందన్నారు. తక్షణం ప్రాజెక్ట నుండి రైతుల పొలాలకు పంట కాలువ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు

అనాథాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - ముద్దనూరు

అన్నదానం చేస్తున్న దాత

స్థానిక డాక్టర్ బాల నారాయణరెడ్డి ఆసుపత్రికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ చింతా నవజ్యోత్ రెడ్డి, డాక్టర్ స్రవంతి కుమార్తె, కుమారుడు ధ్రువ నరసింహ రెడ్డి, దేదీప్య పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలం లోని కోడిగాండ్ల పల్లె గ్రామ సమీపంలో ఉన్న ఏసు కరుణాలయం అనాధాశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేశారు. డాక్టర్ నవజ్యోత్ రెడ్డి మాట్లాడుతూ తన బిడ్డల జన్మదినం రోజున అనాథలకు అన్న దానం చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో హేమంత్,బాబు పాల్గొన్నారు.

మిఠాయిలు పంపిణీ

ప్రజాశక్తి - వేంపల్లె

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పుట్టిన రోజు సందర్భంగా అమ్ ఆద్మీ పార్టీ నాయకులు మిఠాయిలు పంపిణీ చేశారు. శుక్రవారం వేంపల్లెలో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా, జిల్లా ఉపాధ్యక్షులు దాదాపీర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు. ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ విద్య, వైద్యం పట్ల ప్రత్యేక దృష్టి పెట్టారని చెప్పారు. అవినీతి లేని పాలనను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం అమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం అన్నారు. కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు మహమ్మద్, బాబ్జీ, షఫి, అబ్దుల్, రెహమాన్, చాను పాల్గొన్నారు.

పాఠశాలకు వస్తువులు అందజేస్తున్న యురేనియం అధికారులు

కస్తూర్బా పాఠశాలకు వస్తువులు వితరణ

ప్రజాశక్తి - వేముల

మండల కేంద్రంలోని కస్తూర్బా గురుకుల పాఠశాలకు తుమ్మలపల్లి యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వారు సుమారు రూ. 23 లక్షల విలువైన జనరేటర్, కంప్యూటర్స్, ప్రింటర్స్, ఆరో ప్లాంట్, వంట పాత్రలు, మిక్సీలు, రిఫ్రిజిరేటర్, వాలీబాల్స్, ఫుట్ బాల్, క్రికెట్ కిట్స్,హైజోంప్స్, యోగ మ్యాట్స్, జవాలీన్ త్రో వస్తువులను అందచేశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతగా అనుసరించి యురేనియం సంస్థ జీ.యం ఎం ఎస్ రావు పాఠశాల ప్రిన్సిపల్ శారదకు అందజేశారు. ఈ సందర్భంగా ఎం ఎస్ రావు మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో విద్యార్థులు పలు సమస్యల పట్ల ఇబ్బంది పడుతున్నారని తమ సంస్థ దృష్టికి రావడంతో పిల్లల చదువు దృష్టి ఒక బాధ్యతతో వీటిని అందించామని చెప్పారు. పిల్లల చదువు కోసం అన్ని రకాల సహాయ సహకారాలు పూర్తిస్థాయిలో అందిస్తామని, యురేనియం ప్రాజెక్ట చుట్టుపక్కల గ్రామాలలోనూ తాగునీరు, మెడిసిన ఉచితంగా తాగునీరు, మెడిసిన్ ఉచితంగా అందిస్తామని చెప్పారు.

భూ కబ్జాలను అరికట్టాలి

ప్రజాశక్తి-కాశినాయన

మండల పరిధిలోని అంబవరం రెవెన్యూ పొలంలో 96వ సర్వే నెంబర్‌లో భూకబ్జా జరుగుతుంటే రెవెన్యూ అధికారులు తెలిసి కూడా తెలియనట్లు వ్యవహరించడం చాలా అన్యాయమని సిపిఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్ పేర్కొన్నారు శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో భూకబ్జాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయని వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు.

రెడ్ల ఐక్యతను చాటుదాం

ప్రజాశక్తి - దువ్వూరు

జగన్‌మోహన్‌రెడ్డి

దేశంలోని రెడ్లను ఐక్యం చేసేందుకు కృషి చేస్తున్నామని, రేనాటి సూర్య చంద్రులు పుట్టిన గడ్డ నుంచే రెడ్ల ఐక్యతను చాటుదామని అఖిల భారత రెడ్ల ఐక్య వేదిక ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా కన్వీనర్ నారుపల్లె జగన్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం దువ్వూరులో ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని మండల కేంద్రమైన ఉయ్యాలవాడ గ్రామంలో రేనాటి సూర్య చంద్రులైన ఉయ్యాలవాడ నరసింహరెడ్డి, అన్నదాత ప్రభువు అయిన బుడ్డా వెంగళరెడ్డి పురాతన ఇల్లు, కోటలను, అఖిల భారత రెడ్ల ఐక్య వేదిక బృందం పరిశీలించారన్నారు. కేవలం నియోజకవర్గ, మండల స్థాయి వరకు మాత్రమే కొన్ని రెడ్ల సంఘాలు పనిచేస్తున్నాయని,వాటిని కలుపుకొని పార్టీలకు అతీతంగా ఒకే వేదిక పైకి తీసుకొని వచ్చి రెడ్ల హక్కులు, భవిష్యత్, రెడ్డి జాతిని కాపాడుకునేందుకు అఖిల భారత రెడ్ల ఐక్య వేదిక పనిచేస్తుందన్నారు. అందులో భాగంగా సెప్టెంబర్ 1న ఉయ్యాలవాడలో అఖిల భారత రెడ్ల ఐక్య వేదిక విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. సమావేశానికి రాష్ట్రంలోని అన్ని రెడ్ల సంఘాల ప్రతినిధులు,రెడ్డి కుల బంధువులు అందరూ రాజకీయాలకు అతీతంగా, తరలిరావాలని పిలుపునిచ్చారు.